క్లుప్తంగా

భక్తిప్రపత్తులతో దోపోత్సవం



పుష్పాలంకరణలో వేణుగోపాలుడు

వి.కోట: పట్టణంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో ఎనిమిదవ రోజైన ఆదివారం రాత్రి స్వామి వారి దోపోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. తొలుత ఉదయం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను కొలువు దీర్చి పట్టణ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. మహిళలు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఉభయదారులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ ధర్మకర్త సీతారామయ్య, భక్తుల్ల పాల్గొన్నారు.

రావణ బ్రహ్మ వాహనంపై విహారం



పలమనేరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామి వారు మంగళవాయిద్యాల హోరు నడుమ రావణబ్రహ్మ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం ఆలయం వద్ద అభిషేకం, వసంతోత్సవం, ప్రత్యేక పూజలు, ధ్వజావరోహణం, త్రిశూల స్నానం..ఇత్యాది కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సోమవారం శయనోత్సవంతో ఆలయ బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయని ఆలయ చైర్మన్ వీరభద్ర చెప్పారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బైరెడ్డిపల్లె: స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వార్షికోత్సవ పూజలను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రామక్రిష్ణమాచార్యులు దంపతులతో హోమం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. వాసవీ ఫౌండేషన్ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విశేష అలంకరణలో మసెమ్మ



మసెమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



మసెమ్మా!..కరుణించమ్మా..

- ముగిసిన జాతర
- భక్తజనంతో కురప్పల్లె కిటకిట

పుంగనూరు: మండలంలోని కురప్పల్లెలో మసెమ్మ జాతరకు వేలాది మంది తరలి రావడంతో ఎటు చూసిన భక్త జన సందోహంతో కిటకిటలాడింది. ఆదివారం రాత్రి అమ్మవారిని గ్రామాల్లో అట్టహాసంగా ఊరేగించారు. వేకువజాము నుంచి అమ్మవారికి ప్రజలు చలిపిండి దీపాలు, పెరుగన్నం..ఇత్యాది మొక్కులు చెల్లించుకున్నారు. మేళతాళాలు, భజనలతో, కోలాటలు, నృత్యాలు, ప్రదర్శనలు, పిల్లనగ్రోవి కట్టల నడుమ అమ్మవారి పూజలను వైభవంగా నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని వివిధ రకాల రంగుల రాట్నాలు, పలు దుకాణాలు ఏర్పాటు చేయడంతో వ్యాపారం జోరుగా సాగింది. జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుకోకుండా సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. 40 గ్రామాల ప్రజలు, తమ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలసి విందు భోజనాలతో సందడి చేశారు.

ప్రకృతి వ్యవసాయం..ఆరోగ్యానికి శ్రేష్టం



ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన మిరప పంట



పంటల సాగుకు ఎరువు తయారు చేస్తున్న రైతులు



ర్యాలీలతో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

- తక్కువ ఖర్చుతో పంటల సాగు
- కూరగాయలకు మంచి డిమాండ్

రొంపిచెర్ల: ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో పంటలు సాగు చేసి రైతులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. మండలంలోని గానుగచింత, పెద్దమల్లెల, చెంచెంరెడ్డిగారి పల్లె, రొంపిచెర్ల గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగు చేస్తున్నారు. వారణాసివారిపల్లెకు చెందిన శ్రీహరి 15–20 రకాల పంటలను, అలాగే బెస్తపల్లెకు చెందిన కోమల టమాట, చిక్కుడు, గోరు చిక్కుడు, అనప, ముల్లంగి, మిరప, ఎర్రగడ్డలు, బీన్స్, బెంబ, గోంగూర, కొత్తిమీర, చుక్కాకు..మొదలైన వాటిని ప్రకృతి వ్యవసాయ విధానాలతో పండించారు. నాణ్యతతో కూడి మంచి దిగుబడి కూడా పొందారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి స్థానిక వారపు సంతలో వ్యవసాయ శాఖ అధికారులు ఒక స్టాల్‌ను ఏర్పాటు చేయడంతో కొనుగోలుదారులు వీటిపై మొగ్గు చూపుతున్నారు. అలాగే ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కూడా వీటిని విక్రయిస్తున్నారు. కిలో కూరగాయలు రూ.60 నుంచి రూ.80తో విక్రయిస్తున్నారు. క్రిమి సంహారక మందుల అవశేషాలు లేని ప్రకృతి వ్యవసాయోత్పత్తులు ఆరోగ్యానికి శ్రేష్టమని మరోవైపు అధికారులు కూడా విద్యార్థులతో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలు ఆకర్షితులయ్యేలా చేస్తున్నారు. మొత్తంగా చెంచెంరెడ్డిగారిపల్లె, మూరేవాండ్లపల్లె, బెస్తపల్లెలో సుమారు 210 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.



ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన వరి పంట

మంచి డిమాండ్

ప్రకృతి వ్యవసాయ పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వ్యవసాయాధికారులు మాకు మంచి సహకారం ఇచ్చారు. వారి ప్రోత్సాహంతోనే విజయం సాధిస్తున్నాం.పంటల సాగుకు కావాల్సిన ఎరువులను కూడా నేనే స్వంతంగా ఆవు పేడ, గోమూత్రంతో తయారు చేస్తాం. తక్కువ ఖర్చుతో మా కుటుంబం అంతా ప్రకృతి వ్యవసాయం చేస్తోంది. –కోమల, బెస్తపల్లె

నిబద్ధతతో విధులు నిర్వర్తించండి



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ జాషువా

కుప్పం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనలో సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ జాషువా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఆదివారం జిల్లా పోలీస్ యంత్రాగంతో సమావేశం నిర్వహించారు. సోమవారం సీఎం పర్యటన నేపథ్యంలో సిబ్బందికి కేటాయించి స్థలానికి సమయాలని చేరుకోవాలని, వైర్‌లెస్ సెట్‌కు అందరూ అందుబాటులో ఉండాలన్నారు. సభకు వచ్చిన జనంతో మర్యాదగా ప్రవర్తించి, పిటీషన్లుతో వస్తే వారిని ఎస్పీ, కలెక్టర్ కార్యాలయం వద్దకు చేర్చాలని ఆయన ఆదేశించారు. అలాగే ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్న పక్షంలో వెంటనే పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. హెలిప్యాడ్ వద్ద భద్రత పటిష్టం చేసి, గ్యాలరీలో సామర్థ్యానికి మించి ప్రజలను అనుమతించరాదని, అలాగే ఎలాంటి ఇబ్బంది కలగకుండా పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. సీఎం పర్యటనకు నలుగురు అడిషనల్ ఎస్పీలు, 17 మంది డీఎస్పీలు, 47 మంది సీఐలు, 133 మంది ఎస్ఐలు, అదనపు సిబ్బందితో బందో స్తు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

గ్యారేజీ ఏర్పాటుకు స్థలం కేటాయించరూ!

- టూవీలర్స్ అసోసియేషన్ నేతల వినతి



పలమనేరులో సమావేశం నిర్వహించిన టూవీలర్ మెకానిక్‌లు

పలమనేరు: పలమనేరులోని మోటార్ సైకిళ్ల మెకానిక్స్‌కు గ్యారేజీ ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని పట్టణ టూ వీలర్స్ అసోసియేషన్ నేతలు కోరారు. ఆదివారం పలమనేరులో మెకానిక్స్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, పట్టణంలో 250 మంచి టూవీలర్ మెకానిక్‌ల కుటుంబాలు ఉన్నాయన్నారు. అయితే బైక్ రిపేర్లు చేసేందుకు ఎవరూ గదులను ఇవ్వడం లేదని, ఉన్న షెడ్ల బాడుగలు పెరిగి వాటిని చెల్లించడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, టౌన్ కన్వీనర్ జాఫర్ తమ సమస్యపై దృష్టి సారించి ప్రభుత్వం ద్వారా గ్యారేజీకి అనువైన స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు మహబూబ్, సభ్యులు, పలువురు టూవీలర్ మెకానిక్స్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద నిత్యాన్నదానానికి బెంగళూరు అమృత హళ్లికు చెందిన ఉదయ్ కుమార్, వనిత దంపతులు రూ.25 వేల విరాళమిచ్చారని ఆలయ ఈఓ చంద్రమౌళి ఆదివారం తెలిపారు. కోరిన కోర్కెలు ఫలించడంతో అమ్మవారికి వారు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యుడు పవన్‌కుమార్ దంపతులను సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.



ఈఓ చంద్రమౌళికి విరాళమిస్తున్న బెంగళూరు వాసి

ముగిసిన తిరునాళ్ల

సదుం: మండలంలోని జంగంపల్లె కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న తిరునాళ్ల ఆదివారం ముగిసింది. ఆలయంలో వసంతోత్సవం, పార్వేటి ఉత్సవం, శయనోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.